సాక్షి
తూర్పుగోదావరి
ఆదివారం । 19 । మార్చి । 2023



అన్నదానానికి విరాళం


అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి సాగి విజయలక్ష్మి కుటుంబ సభ్యులు (గోగొన్నమఠం) శనివారం రూ.25వేలు విరాళం సమరించారు.



నిత్యాన్నదానానికి రూ.50 వేలు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో నిత్యాన్నదానానికి అడపా రామకృష్ణ, పార్వతి దంపతులు (భీమవరం) శనివారం రూ.50 వేల విరాళం సమర్పించారు.

డెల్టాలకు నీరు విడుదల



ధవళేశ్వరం: గోదావరి డెల్టా కాలువలకు శనివారం 6,880క్యూసెక్కులు విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2170,మధ్య డెల్టాకు 1410,పశ్చిమ డెల్టాకు 3300 క్యూసెక్కుల నీటిని వదిలారు.

సుంద'రుడా'యే లక్ష్యం..

- రూ.18 కోట్లతో అభివృద్ధి పనులకు ప్రణాళికలు
- కోరుకొండ వద్ద ఆర్టీసీ బస్టాండ్ సుందరీకరణ
- బలభద్రపురంలో వాకింగ్ ట్రాక్ నిర్మాణం
- రుడా బోర్డ్ మీటింగ్‌లో వివిధ పనులకు ఆమోదం



కొవ్వూరులో గోదావరి రివర్యు పాయింట్ (నమూనా)



లాలా చెరువులో చిల్డ్రన్స్ న్యూట్రిషన్ పార్క్ (నమూనా)

సాక్షి, రాజమహేంద్రవరం: రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (రుడా) పరిధిలో సుందరీకరణ, పలు రకాల అభివృద్ధి పనులకు మార్గం సుగమమైంది. రూ.18 కోట్ల బడ్జెట్ అంచనాలతో భవిష్యత్తులో చేపట్టబోయే పనులకు సంబంధించి ప్రణాళికలు రూపుదిద్దుకున్నాయి. ఇందుకు శనివారం స్థానిక రుడా కార్యాలయ సమావేశ మందిరంలో రుడా నాలుగో బోర్డ్ సమావేశం వేదికైంది. ప్రజా ప్రయోజనం, ఆరోగ్య రక్షణ, ఆహ్లాదకర వాతావరణం నెలకొల్పే పనులకు బోర్డు ప్రాధాన్యం ఇస్తోంది. రుడా చైర్‌పర్సన్ షర్మిలా రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మున్సిపల్ కమిషనర్ కె.దినేష్ కుమార్, బోర్డు సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గత బోర్డు మీటింగ్‌లో తీసుకున్న నిర్ణయాలు, వాటి అమలుపై సభ్యులు చర్చించారు. ఇప్పటి వరకు చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలను వెల్లడించారు. తాజాగా రూ.18 కోట్ల పనులను ప్రతిపాదించగా బోర్డు ఆమోదముద్ర వేసింది. త్వరలో టెండర్లు ఆహ్వానించి పనులు పట్టాలెక్కించేందుకు కృషి చేస్తామని షర్మిలా రెడ్డి తెలిపారు.

బోర్డు ఆమోదించిన పనులను పరిశీలిస్తే..

- రుడా పరిధిలో నిర్వహించే పనుల్లో పట్టణాల సుందరీకరణ, వాకింగ్ ట్రాక్‌లు, రివిట్‌మెంట్‌తో కూడిన వాటర్ బాడీ, బీచ్ ఫ్రంట్ నిర్వహణ లాంటి పనులకు మొదటి ప్రాధాన్యత కల్పిస్తున్నారు.
- అనపర్తి నియోజకవర్గం బలభద్రపురంలో రూ.1.50 కోట్లతో వాకింగ్ ట్రాక్, రివిట్‌మెంట్‌తో కూడిన వాటర్ బాడీ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేశారు.
- కొత్తపేట నియోజకవర్గంలోని ఆత్రేయపురం వద్ద వార్ఫ్ రోడ్డు వద్ద రూ.1.50 కోట్లతో రివర్ ఫ్రంట్ పనులకు మార్గం సుగమమైంది. దీంతో ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం కల్పించాలన్నదే ముఖ్య ఉద్దేశంగా పెట్టుకున్నారు.
- నిడదవోలు మున్సిపాలిటీలోని చిన్న కాశీ రేవు నుంచి గూడెం గేటు వరకు రహదారి నిర్మాణానికి రూ.కోటి వెచ్చించనున్నారు.
- గోష్పాద క్షేత్రం సమీపంలోని కొవ్వూరు కట్ట వెంబడి రివర్ ఫ్రంట్ ప్రాంతం అభివృద్ధి చేపట్టి భక్తులకు స్వాంతన కలిగించేందుకు ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నారు. ఇందుకు గాను రూ.1.25 కోట్లు ఖర్చు చేయనున్నారు.
- రుడా ఏర్పడి ఏడాది దాటినా నేటికీ సొంత కార్యాలయం లేదు. రూ.10 కోట్లతో రుడా కార్యాలయ నిర్మాణానికి బోర్డు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.
- విమాన ప్రయాణికులకు ఆహ్లాదకర వాతావరణం కల్పించే దిశగా అడుగులు వేస్తున్నారు. రాజమహేంద్రవరం ఎయిర్‌పోర్ట్ రోడ్డు వెంబడి ఉన్న సెంట్రల్ లైటెనింగ్ పోల్స్‌కు ఎల్ఈడీ మోటిఫ్ ఏర్పాటుకు రూ.75 లక్షలు వెచ్చించనున్నారు.
- **రూ.2 కోట్లతో కోరుకొండ జంక్షన్ వద్ద ఆర్టీసీ బస్‌స్టాప్ పునరుద్ధరణ, సుందరీకరణ, వసతుల కల్పనకు బోర్డు ఆమోదం తెలిపింది.**

భవన నిర్మాణాలకు అనుమతులు

రుడా పరిధిలో భవన నిర్మాణాలు, లేఅవుట్లకు దరఖాస్తు చేసుకున్న వెంటనే అనుమతులు మంజూరు చేస్తున్నారు. ఇప్పటి వరకు 5,068 దరఖాస్తులు రాగా 4,679 ఆమోదించారు. టీఎల్‌పీలో 99 దరఖాస్తులకు 59 ఆమోదించారు. ఎఫ్ఎల్‌పీలో 50కు గాను, 45, ఎల్‌డీసీసీ కింద 52 గాను 33 ఆమోదించినట్లు బోర్డు వెల్లడించింది. భవన నిర్మాణ అనుమతులకు 443 దరఖాస్తులు రాగా 212 ఆమోదించారు. ఎల్ఆర్ఎస్ 2020 కింద 3,520 రాగా, 624 ఆమోదించారు. తద్వారా రూ.1196.47 లక్షల ఆదాయం వచ్చింది. సమావేశంలో రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ జై సూరజ్ కుమార్, రుడా సెక్రటరీ శైలజ, టూరిజం డివిజనల్ మేనేజర్ స్వామి నాయుడు , జిల్లా పరిశ్రమల అధికారి కే.వెంకటేశ్వరరావు, డీపీఓ జగదాంబ, రుడా ప్లానింగ్ ఆఫీసర్ ఎస్. శ్రీనివాస్, రుడా అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ జి.శ్రావణ్ కుమార్, రుడా ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టి.చంద్రశేఖర్, రుడా జేపీఓ కె.రాజకుమారి, ఏఈ దుర్గ ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా పనుల నిర్వహణ

రుడా పరిధిలో చేపట్టే పనులు ప్రతిష్టాత్మకంగా, పకడ్బందీగా, ప్రణాళికాబద్ధంగా నిర్వహిస్తున్నాం. మహిళలకు రక్షణ కల్పించే దిశగా 'రాజమహేంద్రవరంలో జగనన్న ఉమెన్ సేఫ్ హెవెన్' కేంద్రం నిర్మించాం. పుష్కర ఘాట్‌లో మహిళలు దుస్తులు మార్చుకునే గదులను ఏర్పాటు చేశాం. హేవలాక్ బ్రిడ్జిని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరిచాం. రుడా పరిధిలోని నియోజకవర్గాల ప్రజాప్రతినిధుల నుంచి అభివృద్ధి పనుల వివరాలను సేకరిస్తున్నాం. రుడా పరిసర ప్రాంతాల్లో కొన్ని గ్రామాలను రుడాలో విలీనం చేయాలని ప్రజలు, ప్రజాప్రతినిధుల నుంచి అభ్యర్థనల మేరకు గ్రామాలను కలిపాం.

- మేడపాటి షర్మిలారెడ్డి, చైర్‌పర్సన్, రుడా



వివరాలు వెల్లడిస్తున్న 'రుడా' చైర్‌పర్సన్ షర్మిలారెడ్డి, చిత్రంలో కమిషనర్ దినేష్‌కుమార్

తాగునీటి సమస్యకు పరిష్కారం

రుడా పరిధి మరింత విస్తరించిన నేపథ్యంలో అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇస్తున్నాం. రాజమహేంద్రవరం నగర పరిధిలో ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా చూస్తాం. ఆల్కాట్ గార్డెన్ పాత పైప్ లైన్ స్థానంలో రూ.2 కోట్లతో పైప్ లైన్ నిర్మాణం చేపడుతున్నాం. ఇంటి పన్నులు చెల్లించాల్సిన వారు మార్చి 31వ తేదీ లోపు చెల్లిస్తే వడ్డీ మాఫీ చేస్తాం.

- కె.దినేష్ కుమార్, మున్సిపల్ కమిషనర్

న్యూస్‌రీల్

స్కిల్‌హబ్స్‌లో వివిధ కోర్సులలో శిక్షణ

రాజమహేంద్రవరం రూరల్: నిరుద్యోగ యువతకు నియోజకవర్గ స్కిల్ హబ్స్‌లో వివిధ కోర్సులలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ప్రభుత్వ ఐటీఐ, ప్రభుత్వ డిగ్రీ, ప్రభుత్వ జూనియర్ కళాశాల, నాక్ సంయుక్త ఆధ్వర్యంలో పీఎంకేవీవై 4.0 పథకం ద్వారా ఈ శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎం .కొండలరావు ఓ ప్రకటనలో తెలిపారు. డొమెస్టిక్ డాటా ఎంట్రీ ఆపరేటర్, అసిస్టెంట్ బ్యూటీ థెరపిస్ట్, అసోసియేట్ ఎలక్ట్రీషియన్, సర్వేయర్ ఎయిడ్, అసిస్టెంట్ టెక్నీషియన్ - సీసీటీవీ, స్వీయింగ్ మెషీన్ ఆపరేటర్ (స్త్రీలకు), అసెంబ్లీ ఆపరేటర్ – ఆర్ఏసీ, ఫిట్టర్ ఫ్యాబ్రికేషన్, అసిస్టెంట్ టెక్నీషియన్ – ఎయిర్ కండీషనర్, డొమెస్టిక్ ఐటీ హెల్ప్‌డెస్క్ అటెండెంట్, కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్ –డొమెస్టిక్ నాన్ వాయిస్ కోర్సుల్లో శిక్షణ ఇస్తామన్నారు. కోర్సుల్లో చేరడానికి 18 ఏళ్ల నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సు కలిగి 10వ తరగతి నుంచి పీజీ చేసిన వారి వరకూ అర్హులన్నారు. అభ్యర్థుల సౌలభ్యం కోసం ఉచితంగా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేస్తారన్నారు. అభ్యర్థులు ఆధార్ కార్డ్ జిరాక్స్, ఆధార్ లింక్డ్ ఫోన్ నెంబర్, ఈ మెయిల్ ఐడితో రాజమండ్రి అర్బన్ - 9133912947, రాజమండ్రి రూరల్ –9063648365, రాజానగరం - 9959967534 , అనపర్తి - 9550882754 , గోపాలపురం - 8499943366 , కొవ్వూరు –7306232373, నిడదవోలు - 9676052454 ఫోన్‌నెంబర్లలో సంప్రదించాలని కొండలరావు కోరారు.

వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు చర్యలు



సమావేశంలో పాల్గొన్న ఆరిఫ్ తదితరులు

సీటీఆర్ఐ: వక్ఫ్ బోర్డు ఆస్తుల పరిరక్షణకు చర్యలు వేగవంతం చేసినట్లు వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ మొహమ్మద్ ఆరిఫ్ చెప్పారు. శనివారం సంస్థ కార్యాలయంలో జిల్లా వక్ఫ్ బోర్డ్ కమిటీ తొలి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా వక్ఫ్ బోర్డ్ ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ షఫీఉల్లా జిల్లాలో వక్ఫ్ ఆస్తులు, మసీదులు ఇతర వ్యవహారాలను వివరించారు. అన్యాక్రాంతమైన వక్ఫ్ బోర్డ్ ఆస్తులను తిరిగి స్వాధీనం చేసుకోవడం, మసీదులు, దర్గాలు ఇతర సంస్థల ఆదాయ మార్గాలను పెంచుకోవడంపై చర్చించారు. త్వరలోనే జిల్లాలో వక్ఫ్ బోర్డ్ ఆస్తులను ప్రత్యక్షంగా పరిశీలించి నివేదిక రిపొందించాలని నిర్ణయించారు. కార్యక్రమంలో జిల్లా వైస్ చైర్మన్ షేక్ వజీరుద్దీన్, జిల్లా డైరెక్టర్లు షట్టర్ బాషా, షేక్ అహ్మద్, పఠాన్ రహీం,జఫ్రుల్లా ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

20, 21వ తేదీలలో ఆధార్ శిబిరాలు

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): జిల్లాలో 66 ప్రత్యేక అధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ మాధవీలత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొవ్వూరు డివిజన్‌లో 20, రాజమహేంద్రవరం డివిజన్‌లో 46 కేంద్రాల ద్వారా ఆధార్ రెన్యువల్‌కు ఏర్పాట్లు చేశామన్నారు. ప్రతి పది సంవత్సరాలకు ఒకసారి తప్పని సరిగా రెన్యువల్ చేయించుకోవలసి ఉంటుందన్నారు. ఈనెల 20, 21వ తేదీలలో మండల కేంద్రాలు, గ్రామాలలో ప్రత్యేక శిబిరాలకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

రత్నగిరిపై ముగిసిన కంచి పీఠాధిపతి విజయయాత్ర

అన్నవరం: కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్వామిజీ విజయయాత్ర శనివారం అన్నవరంలో దిగ్విజయంగా ముగిసింది. మధ్యాహ్నం స్థానిక రైల్వేస్టేషన్ రోడ్‌లోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి పీఠాధిపతి ప్రత్యేక పూజలు చేశారు.

పదో తరగతి పరీక్షలకు పకడ్బందీగా సన్నాహాలు

- 126 పరీక్షా కేంద్రాలలో నిర్వహణ
- ఏర్పాట్లపై చర్చించిన అధికారులు



సమావేశంలో పాల్గొన్న డీఆర్ఓ నరసింహులు తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం సిటీ): జిల్లాలో పదవ తరగతి రెగ్యులర్ పరీక్షలను 126 కేంద్రాలలో నిర్వహించనున్నారు. 29 కేంద్రాలలో ఓపెన్ సెకండరీ స్కూల్ కోర్స్ పరీక్షలను నిర్వహించనున్నారు. ఏప్రిల్ 3 నుంచి 18 వరకు జరిగే ఈ పరీక్షల నిర్వహణపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు జిల్లా విద్యా అధికారి ఎస్. అబ్రహంతో కలిసి సమన్వయ సమావేశం నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నరసింహులు మాట్లాడుతూ పదో తరగతి పరీక్షా కేంద్రాల వద్ద గట్టి పోలీసు భద్రత ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని స్పష్టం చేశారు. జిల్లా యంత్రాంగానికి, పోలీసులకు సహకరించాలని విద్యార్థుల తల్లిదండ్రులను ఆయన కోరారు. విద్యార్థులను పరీక్షా కేంద్రాలలోకి అనుమతించే సమయంలో బాలురు, బాలికలకు విడివిడిగా తనిఖీలు నిర్వహించాలన్నారు. బాలికలకు ప్రత్యేక గదిలో మహిళా పోలీస్ సిబ్బంది మాత్రమే తనిఖీ చేయాలన్నారు. మాస్ కాపీయింగ్ జరుగకుండా 'సి' సెంటర్ల వద్ద అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలన్నారు. మెడికల్ బృందాలను కూడా సిద్ధంగా ఉంచాలన్నారు. పరీక్షా కేంద్రాల రూట్‌లలో విద్యార్థుల సంఖ్య ఆధారంగా బీ సెంటర్లకు ఆర్టీసి బస్సులు నడపాలని పేర్కొన్నారు. హాల్ టికెట్ చూపించిన విద్యార్థులకు ఉచితంగా ప్రయాణించడానికి అనుమతి ఇస్తామన్నారు. ఉదయం 7గంటల నుంచి ఆయా రూట్లలో ఆర్టీసీ బస్సులు అందుబాటులో ఉంచాలన్నారు. మారుమూల ప్రాంతాల్లోని కేంద్రాలకు ప్రైవేటు ఆటోలు తిరిగేలా చూడాలని ఆర్టీవోకు సూచించారు.

గంట ముందే అనుమతి

డీఈఓ అబ్రహం మాట్లాడుతూ సుమారు 26 వేల మంది రెగ్యులర్ పరీక్షలను రాయనున్నారని చెప్పారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. 2,092 మంది విద్యార్థులకు ఓపెన్ స్కూల్ పదవ తరగతి పరీక్షను కోసం ఏడు కేంద్రాలలో నిర్వహిస్తామన్నారు. పరీక్షలకు గంట ముందే పరీక్షా కేంద్రాలలోకి అనుమతిస్తామన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ కోసం తొమ్మిది వాహనాలను, ప్రశ్న పత్రాల తరలింపునకు తొమ్మిది క్లోజ్డ్ వాహనాలు అవసరమని రవాణా శాఖ అధికారులకు ప్రతిపాదనలు పంపించామన్నారు. పరీక్షా కేంద్రాల సమీపంలో జెరాక్స్ షాపులు, ఇంటర్నెట్ కేంద్రాలు, బడ్డీ షాపులను పరీక్ష సమయంలో మూసివేయిస్తామన్నారు. పోలీస్, రెవెన్యూ, విద్య, విద్యుత్, ట్రెజరీ, వైద్య ఆరోగ్య, మునిసిపల్, పంచాయతీ రాజ్, పోస్టల్, ఆర్టీసి, రవాణా, సమాచార, సార్వత్రిక విద్య పీఠం తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

రత్నగిరికి 'ఏకాదశి' తాకిడి



సత్యదేవుని దర్శనానికి క్యూ లో నిల్చున్న భక్తులు

అన్నవరం: ఫాల్గుణ బహుళ ఏకాదశి, శనివారం పర్వదినం సందర్భంగా సత్యదేవునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రత్నగిరికి వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయాన్ని తెల్లవారుజామున ఐదు గంటలకు తెరిచారు. వ్రతాల నిర్వహణ ప్రారంభించారు. ఉదయం 6 నుంచి దర్శనానికి అనుమతించారు. సాయంత్రం వరకు భక్తులతో ఆలయం కిటకిట లాడింది. ప్రత్యేక దర్శనానికి గంట, సాధారణ దర్శనానికి రెండు గంటల సమయం పట్టింది. స్వామివారి వ్రతాలు 2,500 నిర్వహించారు. రూ.40 లక్షలు ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఏకాదశి పర్వదినం సందర్భంగా సత్యదేవుడు, అనంతలక్ష్మీ అమ్మవారికి ఉదయం 108 స్వర్ణపుష్పాలతో స్వర్ణపుష్పార్చన నిర్వహించారు.

బీఎస్ఎన్ఎల్ ఐపీ టీవీ ప్రారంభం



జ్యోతిప్రజ్వలన చేస్తున్న కమిషనర్ దినేష్‌కుమార్

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): నాణ్యమైన మీడియా ప్రసారాలు అందించేందుకు బీఎస్ఎన్ఎల్ ఐపీ టీవీని ప్రారంభించినట్లు బీఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ పలివెల రాజు తెలిపారు. రాజమహేంద్రవరంలోని గోకవరం బస్టాండ్ వద్ద బీఎస్ఎన్ఎల్ నన్నయ సంచార్ భవన్‌లో టీవీ సేవలను ఆయన ప్రారంభించారు. కార్పొరేషన్ కమీషనర్ దినేష్‌కుమార్ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ ఉల్కాటీవీ భాగస్వామ్యంతో బీఎస్ఎన్ఎల్ ఐపీ టీవీ ప్రారంభించిన రెండో రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ కావడం గర్వకారణమన్నారు. తక్కువ ధరలకు నాణ్యమైన సేవలందించడమే లక్ష్యంగా తమ సంస్థ పనిచేస్తోందన్నారు. పట్టణాలలో, గ్రామాలలో భారత్ ఫైబర్ వినియోగదారులతో పాటు కొత్త కనెక్షన్ తీసుకున్న వారికి కూడా టీవీ సేవలు అందిస్తామన్నారు. ఈ సర్వీసు ద్వారా సుమారు వెయ్యికి పైగా టీవీ ఛానల్స్ వీక్షించవచ్చన్నారు. ఈ నెలలో ఫైబర్ నెట్ కనెక్షన్ తీసుకున్న వారికి ఆఫర్స్ ఇస్తున్నామన్నారు. సేవల విషయంలో సీజీఎం కె.సురేష్ కృష్ణ కృషి చేశారన్నారు. దినేష్‌కుమార్ మాట్లాడుతూ బీఎస్ఎన్ఎల్ ద్వారా టీవీ ప్రసారాలు మరింత మంది ప్రజలకు చేరువకావాలని ఆకాంక్షించారు. బీఎస్ఎన్ఎల్ ఉద్యోగ సంఘాల నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

వానలపై అన్నదాత అప్రమత్తం



సీతానగరంలో మొక్కజొన్న తడవకుండా బరకాలు కప్పిన రైతులు

సాక్షి, రాజమహేంద్రవరం/రాజమహేంద్రవరం రూరల్: బంగాళాఖాతంలో ద్రోణి ప్రభావంతో జిల్లాలో రెండు రోజుల నుంచి ఓ మోస్తరు వర్షం కురుస్తోంది. ఇప్పటికే రైతాంగం అప్రమత్తమైంది. రాజమహేంద్రవరంలో శనివారం ఉదయం జల్లులు పడ్డాయి. రోజంతా వాతావరణం మేఘావృతమై ఉంది. సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. .జిల్లా సగటు 0.2 మిల్లీ మీటర్ల వర్ష పాతం నమోదైంది. రాజానగరంలో 1.0 మిల్లీ మీటర్లు, బిక్కవోలు, తాళ్లపూడి, ఉండ్రాజవరం, రంగంపేటలో 0.2, గోపాలపురం 1.2, రాజమండ్రి అర్బన్ 0.6, కొవ్వూరు 0.4 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. మిగిలిన మండలాల్లో చిరుజల్లు కురిశాయి.

వర్షాలు తగ్గేవరకూ కోతలు ఆపాలి

కోసిన ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు ఓ ప్రకటనలో సూచించారు. జిల్లాలో వరి పంట ప్రస్తుతం గింజ పాలు పోసుకునే దశ నుంచి గింజ గట్టి పడే దశకు చేరుకుందన్నారు. వర్షాలు తగ్గే వరకూ పంట కోతలను ఆపాలన్నారు. వరి ఆర్ఎస్ఆర్ 15,048 రకం 75 కిలోల బస్తా బయట మార్కెట్లో రూ.1,650 పలుకుతుందన్నారు. ఈ రకాన్ని రాజమహేంద్రవరం , రాజానగరం పరిసర ప్రాంతాల్లోని 32,130 హెక్టార్లలో సాగు చేశారన్నారు. ఇప్పటి వరకూ రాజమహేంద్రవరం రూరల్ మండలంలో 222 హెక్టార్లు, రాజానగరం మండలంలో 45 హెక్టార్లలో వరి కోతలు జరిగాయన్నారు. మిగతా వరి రకాల్లో ముఖ్యమైన ఎంటీయూ 1,121 రకం కోతలకు ఇంకా సమయం ఉందన్నారు. అధికంగా వర్షాలు పడితే పొలంలో నీటిని కాలువల ద్వారా బయటకు తరలిస్తే పంటకు ఎటువంటి ప్రమాదం ఉండదన్నారు.

3 గ్రామాల్లో పోలాల్లోకి నీరు

కోరుకొండ, గోకవరం మండలాల పరిధిలో కొత్తపల్లి, జగన్నాథపురం, బుచ్చుపేట గ్రామాల్లోని పొలాల్లోకి నీరు చేరింది. కొత్తపల్లిలో రెండు హెక్టార్లలో పొద్దుతిరుగుడు, జగన్నాథపురంలో 5, బుచ్చుపేటలో 15 హెక్టార్లల్లో సెనగ పంట దెబ్బతిన్నట్లు వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనా రూపొందించింది. మిగిలిన పంటలకు ఎలాంటి నష్టం వాటిల్లలేదని స్పష్టం చేసింది.

ఏషియన్ ఖోఖో చీఫ్ రిఫరీగా శ్రీనివాసరావు



కిర్లంపూడి: అస్సాంలో ఈ నెల 20 నుంచి 23వ తేదీ వరకూ నిర్వహించే ఏషియన్ ఖోఖో చాంపియన్‌షిప్ పోటీలకు కిర్లంపూడికి చెందిన కర్రి శ్రీనివాసరావు చీఫ్ రిఫరీగా ఎంపికయ్యారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఖోఖో సంఘం కార్యదర్శి కె.పట్టాభిరామ్ ఈ విషయం తెలిపారు. శ్రీనివాసరావు కిర్లంపూడి యంగ్‌మెన్స్ స్పోర్ట్స్ క్లబ్ పూర్వ క్రీడాకారుడు కూడా. ఆయనను క్లబ్ అధ్యక్షుడు పెంటకోట నాగబాబు, తూర్పు గోదావరి జిల్లా ఖోఖో సంఘం ఉపాధ్యక్షుడు చదలవాడ బాబి, సర్పంచ్ మహేంద్రాడ శ్రీలత తదితరులు అభినందించారు.

81 ఇంటర్ పరీక్ష కేంద్రాల్లో తనిఖీలు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం)/అమలాపురం టౌన్: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా 140 కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని ప్రాంతీయ ఇంటర్మీడియెట్ బోర్డు అధికారి (ఆర్ఐఓ) ఎన్ఎస్‌వీఎల్ నరసింహం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం జరిగిన సెకండియర్ ఇంగ్లిషు పరీక్షకు జనరల్ విభాగంలో 40,364 మందికి గాను 39,119 మంది విద్యార్థులు హాజరయ్యారని, 1,245 మంది పరీక్ష రాయలేదని తెలిపారు. అలాగే ఒకేషనల్ విభాగంలో 4,638 మందికి గాను 4,384 మంది హాజరయ్యారని, 254 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 81 పరీక్షా కేంద్రాల్లో స్క్వాడ్‌లు తనిఖీ చేశాయని, ఒక మాల్ ప్రాక్టీస్ కేసు నమోదైందని తెలిపారు. విద్యార్థుల రైటింగ్ ప్యాడ్స్‌పై సబ్జెక్టుకు సంబంధించిన, ఇతర రాతలు ఉంటే అనుమతించబోమని నరసింహం స్పష్టం చేశారు.

లోక్ అదాలత్‌లో రూ.73.33 లక్షల నష్టపరిహారం అందజేత

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా వివిధ కోర్టుల్లో శనివారం నిర్వహించిన స్పెషల్ లోక్ అదాలత్‌లో బాధితులకు రూ.73.33 లక్షల పరిహారం అందించారు. కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురం, పెద్దాపురం, పిఠాపురం, రామచంద్రపురం, రాజోలు, ఆలమూరు, తుని, ముమ్మిడివరం, కొత్తపేట, ప్రత్తిపాడు, అనపర్తి, రంపచోడవరం, అడ్డతీగల ప్రాంతాల్లో లోక్ అదాలత్ 31 బెంచ్‌లు ఏర్పాటు చేసి, ఉదయం 10 గంటల నుంచి ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించారు. కోర్టులో పెండింగ్ ఉన్న కుటుంబ తగాదాలు, వినియోగదారులు, పాక్షిక న్యాయ అధికార సంస్థల్లో పెండింగ్ ఉన్న మేధోసంపత్తి హక్కుల తదితర 38 కేసులను ఇరు వర్గాలతో మాట్లాడి రాజీ మార్గం ద్వారా పరిష్కరించారు.

కారు, వ్యాన్ ఢీ.. ఇంజినీరింగ్ అసిస్టెంట్ మృతి



నవీన్‌కుమార్ మృతదేహం

దేవరపల్లి: గోపాలపురం మండలం కరిచర్లగూడెం వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గ్రామ సచివాలయం ఇంజినీరింగ్ అసిస్టెంట్ దేవరపల్లి పవన్‌కుమార్ (38) మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం జంగారెడ్డిగూడేనికి చెందిన పవన్‌కుమార్ గోపాలపురం మండలం భీమోలు గ్రామ సచివాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. శనివారం విధులు ముగించుకుని జంగారెడ్డిగూడేనికి కారులో వెళ్తుండగా, ఎదురుగా వస్తున్న ఐషర్ వ్యాన్ ఢీకొంది. ఈ ప్రమాదంలో నవీన్‌కుమార్ మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. గోపాలపురం పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

'లెక్క' తప్పడంతో పరీక్ష జాప్యం



పరీక్ష పూర్తయిన అనంతరం వానలో తడుస్తూ వెళ్తున్న విద్యార్థులు

అనపర్తి/రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ పరిధిలో శనివారం డిగ్రీ ఐదో సెమిస్టర్ పరీక్ష ఆలస్యంగా ప్రారంభమైంది. సాధారణంగా అనుబంధ కళాశాలలకు రోజూ ప్రశ్నపత్రాలు నిర్ణీత సమయానికి గంట ముందుగా యూనివర్సిటీ నుంచి ఆన్‌లైన్‌లో పంపిస్తుంటారు. శనివారం మధ్యాహ్నం 2 గంటలకు మ్యాథమెటిక్స్, బోటనీ, యానిమేషన్ పరీక్షలు ప్రారంభం కావాల్సి ఉంది. ఆన్‌లైన్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో ప్రశ్నపత్రాలు పంపించడంలో కొంత ఆలస్యం అయింది. ఈ మేరకు యూనివర్సిటీ అధికారుల నుంచి పరీక్ష కేంద్రాలకు ముందస్తు సమాచారం వచ్చింది. ఆలస్యంగా వచ్చిన పశ్నపత్రాల్లో కూడా గణితానికి సంబంధించిన పత్రంలో కొన్ని ప్రశ్నలు 'ఓవర్‌లాప్' (అక్షరాలపై అస్పష్టత) అయ్యాయి. దీంతో విద్యార్థులు గందరగోళానికి గురయ్యారు.ఈ సమస్యను గుర్తించిన అధికారులు వెంటనే యూనివర్సిటీ అధికారుల దృష్టికి తీసుకు వెళ్లారు. వారు తప్పులను సరిచేసి మరో ప్రశ్నపత్రాన్ని పంపించడానికి మరికొంత సమయం పట్టింది. ఫలితంగా సాయంత్రం 5 గంటలకు పూర్తి కావలసిన పరీక్ష 6.45 గంటల వరకూ జరిగింది. దీనిపై యూనివర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామ్స్ లింగారెడ్డిని వివరణ కోరగా.. కొన్ని అక్షరాలు ఓవర్‌ల్యాప్ అవడం వల్ల విద్యార్థులు ఆందోళన చెందారన్నారు. మిగిలిన వాటిని ఆన్సర్ చేసుకోమని చెప్పి, ఓవర్‌ల్యాప్ అయిన వాటిని సరి చేసి, మరో ప్రశ్నపత్రం పంపించామన్నారు. వారికి మూడు గంటల పాటు సమయం ఇచ్చామని లింగారెడ్డి చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురు విద్యార్థులకు గాయాలు

దేవరపల్లి: యర్నగూడెం గండి చెరువు వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు విద్యార్థులు గాయపడ్డారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని ధుమంతునిగూడేనికి చెందిన ధనుబోయిన మనోజ్‌కుమార్, నక్కా శ్యామ్, యర్నగూడేనికి చెందిన కొడవటి పీటర్ జాయ్, గణేష్‌లు యర్నగూడెంలోని సెయింట్ జోసఫ్ హైస్కూల్లో పదో తరగతి చదువుతున్నారు. పాఠశాలలో జరుగుతున్న పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమానికి వెళ్లారు. అక్కడి నుంచి పెట్రోలు కోసం రెండు బైక్‌లపై నలుగురు విద్యార్థులు గ్రామ శివారున ఉన్న బంకుకు బయలుదేరారు. ఈ క్రమంలో గండి చెరువు వంద్ద ముందు వెళుతున్న ఆటోను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో నలుగురు విద్యార్థులూ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను 108లో గోపాలపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీరిలో మనోజ్‌కుమార్ పరిస్థితి విషమంగా ఉండడంతో రాజమహేంద్రవరంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై కె.శ్రీహరిరావు తెలిపారు.



గాయపడిన విద్యార్థులను ఆసుపత్రికి తరలిస్తున్న 108 సిబ్బంది

డిక్కీలో ఉంచిన రూ.9.91 లక్షల చోరీ

సామర్లకోట: స్థానిక పెద్దాపురం రోడ్డులోని యూనియన్ బ్యాంకు వద్ద స్కూటర్ డిక్కీలో ఉంచిన నగదు చోరీ అయ్యింది. బాధితుడు, పోలీసుల కథనం ప్రకారం.. వైఎస్సార్ సీపీ నాయకుడు, చిరు వ్యాపారి పుట్టా సూరిబాబు తనకు చెందిన ఒక షాపు విక్రయానికి సంబంధించి అడ్వాన్సుగా వచ్చిన మొత్తం రూ.9.91 లక్షలు యూనియన్ బ్యాంకులో డిపాజిట్ చేయడానికి శనివారం వెళ్లారు. ఒకేసారి అంత మొత్తం డిపాజిట్ చేస్తే ట్యాక్స్ పడుతుందని బ్యాంకు అధికారులు చెప్పడంతో ఆ మొత్తాన్ని తన స్కూటర్ డిక్కీలో ఉంచారు. ఆ సొమ్మును నాలుగు వాయిదాల్లో బ్యాంకులో డిపాజిట్ చేయాలని నిర్ణయించుకుని, ఇంటికి తిరిగి వెళ్లారు. ఇంటి వద్ద డిక్కీ తెరచి చూడగా సొమ్ము కనిపించలేదు. వెంటనే ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. పెద్దాపురం సీఐ అబ్దుల్ నబీ, సామర్లకోట సీఐ కె.దుర్గాప్రసాద్, క్రైం సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. బాధితుని ఫిర్యాదు మేరకు సీఐ దుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



ప్రత్యేక అలంకరణలో వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి



భక్తులతో పోటెత్తిన వెంకన్న ఆలయం

కోనసీమ తిరుపతి.. భక్తజన గోదారి

- వేంకటేశ్వరుని దర్శించిన 40 వేల మంది భక్తులు
- వాడపల్లిలో ప్రతిధ్వనించిన గోవింద నామస్మరణ
- రూ.16.96 లక్షల ఆదాయం

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శనివారం భక్తజన గోదారే అయ్యింది. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి ప్రీతికరమైన శనివారం, ఏకాదశి పర్వదినం, స్వామి వారి నక్షత్రం శ్రవణం కలిసి రావడంతో వేలాదిగా భక్తులు ఆలయానికి తరలివచ్చారు. గోవింద నామస్మరణతో వాడపల్లి పరిసరాలు ప్రతిధ్వనించాయి. బస్సులు, సొంత వాహనాలపై దాదాపు 40 వేల మంది భక్తులు ఆలయానికి చేరుకున్నారు. గౌతమీ గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి, స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. వేకువజాము నుంచే వాడపల్లి చేరే రహదారి భక్తులు, వారి వాహనాలతో కిక్కిరిసిపోయింది. స్వామి వారిని బుల్లితెర నటుడు తోట జానకిరామ్ (జాకీ) దర్శించుకున్నారు. ప్రత్యేక దర్శనం, అన్నప్రసాద విరాళాలు, వివిధ సేవలు, లడ్డూ ప్రసాద విక్రయాలు, ఇతర విరాళాల రూపంలో స్వామి వారికి రూ.16,96,093 ఆదాయం సమకూరిందని ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.



స్వామి వారి సన్నిధిలో బుల్లితెర నటుడు జాకీ

వైభవంగా అధ్యయనోత్సవాలు ప్రారంభం

శ్రీ వేంకటేశ్వరస్వామి వారి వార్షిక తిరు కల్యాణోత్సవాలు త్వరలో జరగనున్న నేపథ్యంలో వేద పండితులు ఆలయంలో అధ్యయనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. అధ్యయనోత్సవాల్లో భాగంగా ఆళ్వారుల విగ్రహాల వద్ద వేద పండితులు వేద పఠనం చేస్తూ స్వామివారి ఆరాధనా కార్యక్రమాలు నిర్వహించారు. దివ్య ప్రబంధ పారాయణ, బాలభోగం, నివేదన, నీరాజన మంత్రపుష్పాది పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ నెల 31 నుంచి వారం రోజుల పాటు జరగనున్న స్వామి వారి కల్యాణోత్సవాల్లో భాగంగా అధ్యయనోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని ఈఓ సత్యనారాయణరాజు చెప్పారు.

సాగు, తాగునీటి సమస్యలపై నిర్దిష్ట ప్రణాళిక

- అధికారులకు జెడ్పీ చైర్మన్ ఆదేశం
- కాకినాడలో స్థాయీ సంఘాల సమావేశాలు

కాకినాడ సిటీ: వేసవిలో సాగు, తాగునీటి సమస్యల నివారణకు నిర్దిష్ట ప్రణాళికలు అమలు చేయాలని అధికారులను జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు ఆదేశించారు. జెడ్పీ కార్యాలయంలో శనివారం స్థాయీ సంఘాల సమావేశాలు జరిగాయి. ఇందులో జెడ్పీ చైర్మన్ విప్పర్తి, వైస్ చైర్మన్ బుర్రా అనుబాబు, వివిధ స్థాయీ సంఘాల సభ్యులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. వివిధ అంశాలకు సంబంధించి పురోగతి, కొత్తగా ప్రతిపాదించిన పనులు, జెడ్పీటీసీ సభ్యులు లేవనెత్తిన అంశాలపై సంబంధిత అధికారులు తీసుకున్న చర్యలపై చర్చించారు. ఏడు స్థాయీ సంఘాల సమావేశాలు ఆయా సంఘాల చైర్‌పర్సన్ల అధ్యక్షతన జరిగాయని విప్పర్తి తెలిపారు. ప్రధానంగా గ్రామీణ నీటి సరఫరా, రహదారులు, వ్యవసాయం, విద్య, వైద్యం, పంచాయతీరాజ్ తదితర అంశాలపై చర్చించామన్నారు. వ్యవసాయానికి సంబంధించి చివరి ఎకరాకు సైతం నీరందేలా కృషి చేస్తున్నామని వెల్లడించారు. సాగు, తాగునీటి సరఫరాకు సంబంధించి గ్రామీణ నీటి సరఫరా, వ్యవసాయం, ఇరిగేషన్ శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని చైర్మన్ వేణుగోపాలరావు ఆదేశించారు. గ్రామాల్లోని మంచినీటి ట్యాంకులన్నింటినీ శుభ్రపరచి, నీటితో నింపాలన్నారు. సాగునీటి కాలువల్లో ప్రవాహం సక్రమంగా ఉండేందుకు కాలువలను శుభ్రం చేయాలని అధికారులను ఆదేశించారు. వచ్చే నెలలో జరిగే పదో తరగతి పరీక్షలకు సంబంధించి ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని విప్పర్తి సూచించారు. కాకినాడ టౌన్ రైల్వేస్టేషన్ సమీపాన ఉన్న జిల్లా పరిషత్ కల్యాణ మండపం అందరికీ అందుబాటులో ఉండేలా గతంలో ఉన్న అద్దెను సవరించామని తెలిపారు. సవరించిన ధరతో కూడిన కరపత్రాన్ని చైర్మన్ వేణుగోపాలరావు, జెడ్పీ సీఈవో ఎన్‌వీవీ సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యులు కలసి విడుదల చేశారు.



స్థాయీ సంఘాల సమావేశాల్లో పాల్గొన్న జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు

ఇంకా ఏం చర్చించారంటే..

- వ్యవసాయ శాఖపై జరిగిన సమీక్షలో జెడ్పీ వైస్ చైర్మన్, వ్యవసాయ స్థాయీ సంఘం చైర్మన్ బుర్రా అనుబాబు మాట్లాడారు. మూడో పంటగా అపరాలు, పచ్చిరొట్ట సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. అన్ని రైతుభరోసా కేంద్రాల్లో 50 శాతం సబ్సిడీపై రైతులకు అవసరమైన విత్తనాలు అందిస్తున్నామన్నారు.
- స్త్రీ, శిశు సంక్షేమం స్థాయీ సంఘ చైర్‌పర్సన్ రొంగల పద్మలత అధ్యక్షతన జరిగిన సమావేశంలో అంగన్‌వాడీ భవనాల నిర్మాణం, చిన్నారులకు పౌష్టికాహారం సరఫరా, నాణ్యత తదితర అంశాలపై సభ్యులు, ఐసీడీఎస్ అధికారులతో చర్చించారు. అధికారులు పలు సంక్షేమ పథకాలను వివరించారు.
- తాగునీటి కొరత ఉన్న ప్రాంతాల్లో ట్యాంకర్లతో తాగునీరు సరఫరా చేస్తామని జిల్లా పంచాయతీ అధికారి ఆర్.విక్టర్ తెలిపారు. గ్రామాల్లో పారిశుధ్య వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు కుక్కల బెడద నియంత్రణకు చర్యలు చేపడతామని చెప్పారు.
- సమావేశంలో డ్వామా పీడీ ఎ వెంకటలక్ష్మి, డిప్యూటీ సీఈఓ ఎ.రమణారెడ్డి, ఏఓ ఎం.బుజ్జిబాబు, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పు గోదావరి, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు చెందిన వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.